క్లుప్తంగా

రాజ్యాంగ పీఠికపై అవగాహన

మండవల్లి: మండలంలోని ఆనందపురం ఐసీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం జి.శామ్యూల్ అధ్యక్షతన బుధవారం రాజ్యాంగ పీఠికపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను నేటి బాలలకు కల్పించడం ఎంతో అవసరం అన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేయించారు. భారత రాజ్యాంగ ప్రవేశిక పుస్తకంలోని బొమ్మలను విద్యార్థులకు చూపించి అవగాహన కల్పించారు.

లక్ష్మీనృసింహస్వామి ఉత్సవాలకు శ్రీకారం



ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా స్వామి, అమ్మవారిని పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు నరసింహస్వామి ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం నరసింహద్వాదశి సందర్భంగా శ్రీలక్ష్మీ నృసింహ సుదర్శన మహాయాగం ప్రముఖ యాజ్ఞీకుడు ఆసూరీ రంగనాథాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని చెప్పారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ



గుడివాడ టౌన్: నెహ్రూ యువ కేంద్రం, వడ్డాది చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకుడు వడ్డాది రాజేష్ బుధవారం తెలిపారు. స్థానిక గౌరీ శంకరపురంలోని కాల్ గ్యాస్ కంపెనీ రోడ్‌లో గల ట్రస్ట్ కార్యాలయంలో ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తికావడంతో, పదో తరగతి పరీక్షలు పూర్తవుతున్న నేపథ్యంలో విద్యార్థులు వారి అవసరాలను బట్టి ఇక్కడ ఉచితంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

వృద్ధుల సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక



గుడివాడ టౌన్: గుడివాడ వృద్ధుల సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా బొగ్గారపు తిరుపతయ్య, కార్యదర్శిగా చిన్నం గంగాధర్, కోశాధికారిగా బొమ్మదేవర సత్యనారాయణ ఎన్నికైనట్లు సంఘం గౌరవాధ్యక్షుడు పెద్దిరెడ్డి సీతారామయ్య తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా సయ్యద్ హన్ను, పి.నాగేశ్వరరావు, టీఎస్‌వీ సాంబశివరావు ఎన్నికయ్యారు.

ఘనంగా బాలా త్రిపురసుందరి అమ్మవారి కల్యాణోత్సవాలు



కూచిపూడి(మొవ్వ): నాట్య క్షేత్రం కూచిపూడిలోని శ్రీ బాలా త్రిపురసుందరి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి వార్ల వార్షిక కల్యాణ మహోత్సవాలు బుధవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవార్లకు శాశ్వత ఉభయదాతలు తూములూరి రామకృష్ణ శర్మ, కవిత దంపతులు నూతన వస్త్రాలు సమర్పించారు. అర్చకులు పెనుమూడి పూర్ణ చంద్రశేఖర శర్మ, పెనుమూడి సతీష్ కుమార్ స్వామివార్లను పెండ్లి కుమార్తె, పెండ్లి కుమారుడిగా అలంకరించారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పమిడిముక్కల: మంటాడ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలు ఈ నెల 24వ తేదీ వరకు జరుగుతాయని చేయాలని ఈఓ మాధవీలత తెలిపారు. ప్రతి శనివారం దేవస్థానంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని, దాతలు సహకరించాలని కోరారు.

మళ్లీ వైఎస్సార్ సీపీదే విజయం

ఎమ్మెల్యే డీఎన్నార్



గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ప్రజా ఆశీస్సులతో మళ్లీ వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించనుందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. గుడ్ మార్నింగ్ కైకలూరు పేరుతో సాగుతున్న కార్యక్రమం బుధవారం స్థానిక 17, 18 వార్డులలో సాగింది. ప్రతి ఇంటికీ వెళ్లి ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. మహిళలు ఆయనకు హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఒకసారి గత ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులను బేరీజు వేసుకోవాలన్నారు. పార్టీలు, కులాలు చూడకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించామన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బలే నాగరాజు, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, మైనారిటీ నాయకులు అబ్దుల్ హమీద్, షేక్ రఫీ, గోట్రూ పాట్రిక్‌పాల్, నాయకులు సమయం అంజి, బందా నారాయణ, గాలిబ్‌బాబు, ఏసు, నిమ్మల శ్రీను, సామిరెడ్డి నారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులనే గెలిపించాలి

ముదినేపల్లి రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలోని పెదగొన్నూరులో రెండో రోజు బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు చెప్పే మాటలను ఎలాంటి పరిస్థితుల్లోనూ విశ్వసించకుండా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా డీఎన్నార్‌ను, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, ఎంపీటీసీ ఏసుబాబు, సర్పంచ్ తాడంకి శిరీష, సొసైటీ అధ్యక్షుడు శ్రవణం పూర్ణ, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు బొర్రా శేషుబాబు, కోమటి విష్ణువర్ధన్, షేక్ అల్లాభక్షు, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.



పెదగొన్నూరులో ప్రచారం చేస్తున్న దూలం స్వాతి

ఎమ్మెల్యే సతీమణి ప్రచారం

కైకలూరు: ప్రజల బాగోగులు ఆలోచించే మంచి వ్యక్తి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అని ఆయన సతీమణి వీరాకుమారి పేర్కొన్నారు. బుధవారం వరహాపట్నం గ్రామంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. కైకలూరు నియోజకవర్గంలో పూర్వం ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా డీఎన్నార్, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ ఉప్పలపాటి నాగమణి, ఎంపీటీసీ పందు గాంధీ ప్రసాద్, నాయకులు బందా నారాయణ, కాసులు, కన్నా రమేష్, పెద్దిరాజు, ఘంటసాల సురేష్, చందు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం కోసం శ్రమిస్తా

ముదినేపల్లి రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం అహర్నిశలు శ్రమిస్తానని రాష్ట్ర మాలమహానాడు, అనుబంధ సంఘాల అధ్యక్షుడు సేవా నాగజగన్ బాబురావు అన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ముదినేపల్లిలోని బాబురావు నివాసంలో బుధవారం మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తున్నట్లు జయమంగళ పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడే వారిని ఎవరినీ వదులుకునే ప్రసక్తి లేదన్నారు. ముఖ్యమంత్రిగా జగనన్న తిరిగి బాధ్యతలు చేపట్టడానికి సహకరించాలని బాబురావును ఎమ్మెల్సీ కోరారు. దీనిపై స్పందించిన బాబురావు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని నిర్మించిన ముఖ్యమంత్రి జగనన్నకు తామెల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటామన్నారు. వైఎస్సార్ సీపీ తిరిగి అధికారం చేపట్టడానికి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ప్రచారం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సయ్యపురాజు గుర్రాజు, దళిత నాయకులు సేవా ఉదయ్, మేడపాటి జగదీష్, అంకపల్లి నాగబాబు, సేవా రవి, మోహనరావు, సంజయ్, వెంకటేశ్వరమ్మ, భూషణం పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేత

గుడివాడరూరల్: మండలంలోని బిళ్లపాడులో ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధమైన నిరాశ్రయులైన బాధిత కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం సాయం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్ మాట్లాడుతూ బిళ్లపాడు గ్రామానికి చెందిన పడమట కనకదుర్గ ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదంలో కాలిపోవడంతో కట్టుబట్టలతో మిగిలారన్నారు. ఈ విషయం తెలుసుకున్న తాము రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ మడకా ప్రసాద్, ట్రెజరర్ అనురాధ, సభ్యులు పావని, సామాజికవేత్త మాచర్ల రామకృష్ణ పాల్గొన్నారు.



అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

నాయకుల విగ్రహాలకు ముసుగులు

పామర్రు: ఎన్నికల సంఘ నిబంధనల మేరకు రాజకీయ పార్టీ నేతల విగ్రహాలకు ముసుగులు తప్పనిసరి అని, దీనికి ఎటువంటి మినహాయింపులు ఉండబోవని పామర్రు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ నోడల్ అధికారి ఎం.భారతి అన్నారు. మండలంలోని పలు రాజకీయ నాయకుల విగ్రహాలకు బుధవారం ముసుగులు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పామర్రు, కొమరవోలు, ఎలకుర్రు తదితర గ్రామాల్లోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయించినట్లు తెలిపారు. రాజకీయ నాయకులు కూడా ఆయా గ్రామాల్లో ఎన్నికల కోడ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.



నిమ్మకూరులోని ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేయిస్తున్న అధికారి

ఆర్అండ్‌బీ స్థలంలో షెడ్ నిర్మాణంపై నోటీసుల జారీ

మండవల్లి: కైకలూరు–ఏలూరు ఆర్అండ్‌బీ రహదారిపై దెయ్యంపాడు–కాకతీయనగర్ మధ్య నుచ్చుమిల్లికి చెందిన బలే సుబ్బారావు షెడ్ నిర్మాణం చేసి కిరాణా దుకాణం ఏర్పాటు చేయడానికి బుధవాం సన్నాహాలు చేశాడు. విషయం తెలిసిన కార్యదర్శి టి.శ్రీనివాసరావు, గ్రేడ్–5 కార్యదర్శి ఘంటసాల రాము సంఘటనా స్థలానికి వెళ్లి సుబ్బారావుకు నోటీసులు జారీ చేశారు. దీంతో నిర్మాణం జరుగకుండా నిలుపుదల చేశారు.



షెడ్ నిర్మాణాన్ని నిలుపుదల చేసిన అధికారులు

ఉపాధి కూలీల వేతనం పెంచాలి

తోట్లవల్లూరు: ఉపాధిహామీ కూలీల వేతనాన్ని కేంద్ర ప్రభుత్వం పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం ప్రకాశరావు కోరారు. తోట్లవల్లూరులో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వేతనంగా రోజుకు రూ.600 ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే పనిదినాలను ఏడాదికి 200 రోజులకు పెంచాలని కోరారు.

బీరువాలోని బంగారు నగలు, నగదు మాయం

పెడన: ఇంట్లో బీరువాలో దాచిన నగలు, నగదు మాయం కావడంపై పెడన పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని నాలుగో వార్డులో నివాసం ఉంటున్న రజియాసుల్తానా ఇంట్లోని బీరువాలో ఉండాల్సిన నగలు, నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. రజియాసుల్తానా గృహిణి. భర్త ఎండీ నజీర్ అహ్మద్ ఏఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మూడేళ్ల కిందట చనిపోయారు. అప్పటి నుంచి ఇంట్లో ఆమె ఒక్కతే ఒంటరిగా ఉంటోంది. ఐదు రోజుల క్రితం చూసినప్పుడు బీరువాలో నగలు, నగదు అలాగే ఉన్నాయి. తిరిగి మంగళవారం ఇంట్లోని బీరువా తెరిచి చూస్తే సుమారు రూ.6 లక్షల విలువ చేసే బంగారు నగలు, రూ.10వేలు నగదు కనిపించలేదు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించడంతో ఎస్ఐ టి.సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేయగా, సీఐ కె.నాగేంద్రప్రసాద్ విచారణ చేపట్టారు.



చోరీ జరిగిన గదిలో క్లూస్ టీంతో విచారణలో సీఐ నాగేంద్రప్రసాద్ తదితరులు

పోస్టర్లు, బ్యానర్లు వెంటనే తొలగించాలి

గుడివాడ టౌన్: ఎన్నికల కమిషన్ ఈ నెల 15వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన సందర్భంగా ఎన్నికల కోడ ప్రస్తుతం అమలులో ఉందని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్, నోడల్ ఆఫీసర్ డీటీవీ కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ శాసన సభ, లోక్ సభ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా ఈ నెల 16 నుంచి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు సంబంధించిన ఓటర్లను ప్రభావితం చేసే ఏ విధమైన ఫ్లెక్సీలు, బ్యానర్లు పబ్లిక్ ప్రాంతాలలో నిషేధించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తమ సిబ్బంది వీటిని పూర్తిగా తొలగిస్తున్నారని, రాజకీయ పార్టీలు సైతం స్వచ్ఛందంగా వాటిని తొలగించి అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. అలా సహకరించని వారిపై చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

గోడలపై పార్టీల రాతల తొలగింపు



కైకలూరు: ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి పార్టీ అనుసరించాలని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్(ఎంసీసీ) పరిశీలకులు ఎంపీడీఓ వీవీఎన్ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. వివిధ పార్టీల ఫ్లెక్సీలు, గోడలపై రాతలను సిబ్బందితో కలసి బుధవారం తొలగింపజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కైకలూరు, ఆటపాక గ్రామాల్లో పార్టీ కార్యాలయాల వద్ద ఫ్లెక్సీలను తొలగించాలని చెప్పామన్నారు. పంచాయతీ సెక్రటరీ జి.శివన్నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా సాయిమందిర వార్షికోత్సవం



తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని శ్రీవిజయ దత్త షిరిడీ సాయినాథుడి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో సాయినాథుని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. సాయంత్రం భక్తులు బాబా పల్లకీసేవ నిర్వహించారు.


శ్మశానవాటికకు దారి కల్పించాలి



ముదినేపల్లి రూరల్: మండలంలోని చిగురుకోట శివారు నరసన్నపాలెం దళితుల శ్మశానవాటికకు దారి సౌకర్యం కల్పించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ కోరారు. స్థానిక దళితుల కోరిక మేరకు శ్మశానాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. దీనిపై స్థానిక వీఆర్వో, సర్వేయర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్మశానవాటికకు దారి లేదని వీరు తెలియజేయడంతో ఏలూరు ఆర్డీఓతో ఫోన్లో మాట్లాడి సాధ్యమైనంత త్వరలో దారి సౌకర్యం కల్పించాలని కోరారు. మాలమహానాడు నాయకులు నన్నేటి నాగరాజు, నేతల సువర్ణరాజు, ఇంటి సుందరకుమార్, మానికొండ వెంకటరాజు, చిరంజీవి, యాకోబు, నాగేంద్ర, ఫణేంద్ర, ఆంజనేయులు, శ్రీనివాస్, ఏసురాజు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు

- 50వ ధర్మక్షేత్రంగా వరహాపట్నం ఆలయం
- ఈ నెల 26 వరకు బ్రహ్మోత్సవాలు



వరహాపట్నం లక్ష్మీనృసింహస్వామి

కైకలూరు: రాష్ట్రంలో 50వ ధర్మక్షేత్రంగా విలసిల్లుతున్న వరహాపట్నం శ్రీ భూ సమేత శ్రీ లక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వేదాద్రి యోగ లక్ష్మీనరసింహస్వామి ఆలయ నమూనాను పరిశీలించి 1902లో ఇక్కడ ఆలయాన్ని నిర్మించారు. సమీప గ్రామాల్లో మించి 65 అడుగుల ఎత్తులో ధ్వజస్తంభం ఇక్కడే ఉంది. ప్రతి ఏడాది ఫాల్గుణ శుద్ధ త్రయోదశి నుంచి పౌర్ణమి వరకు బ్రహ్మోత్సవాలు ఘనంగా దేవదాయ శాఖ నిర్వహిస్తోంది. బ్రహ్మోత్సవాల్లో గరుడ ప్రతిష్ఠను చూసి, ప్రసాదం స్వీకరిస్తే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. వంశపారపర్య ధర్మకర్త, చైర్మన్‌గా కామినేని పట్టాభిరామయ్య వ్యవహరిస్తున్నారు. ఆలయ ఈఓ వీఎన్‌కే.శేఖర్ మాట్లాడుతూ 22న స్వామివారిని పెండ్లికుమారుడుని చేయడం, గోపూజ, సామూహిక కుంకుమార్చన, రాత్రి దివ్య కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 23న గరుడోత్సవం, కల్పవృక్ష వాహనసేవ, 24న చందనోత్సవం, నృసింహ యాగం, రథోత్సవం, 25న శేష, గరుడ వాహనాలపై గ్రామోత్సవం, 26న అఖండ అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు/కలిదిండి/మండవల్లి: ఆధ్యాత్మిక చింతనతో ప్రతిఒక్కరూ మానసిక ప్రశాంతత పొందాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. కైకలూరు మండలం గోనెపాడు రామాలయంలో శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ జలలింగేశ్వర సహిత, జీవధ్వజ ప్రతిష్ఠ, మహా కుంబాభిషేకం, కలిదిండి మండలం భాస్కరరావుపేట రామాలయంలో శ్రీ హనుమత్ సీతారామలక్ష్మణ శిలా విగ్రహ, ఆలయ శిఖర, శిలా ధ్వజా స్తంభం ప్రతిష్ఠ, మండవల్లి మండలం పెనుమాకలంకలో నూతనంగా నిర్మించనున్న శ్రీ పద్దాల వెంకమ్మ తల్లి ఆలయ శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు బుధవారం పాల్గొన్నారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో కైకలూరు, కలిదిండి ఏఎంసీ చైర్మన్లు చేబోయిన వీరరాజు, కొల్లాటి సత్యనారాయణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు గద్దె ఆనంద్ కుమార్, ద్రోణాద్రి నాగలక్ష్మి, చెరుకువాడ బలరామరాజు, బత్తిన శ్రీకాంత్, ముంగర నాగరాజు, మూలలంక ఎంపీటీసీ రావాడి బాలు, పీఏసీఎస్ అధ్యక్షుడు నామాని అన్నవరం, నాయకులు సయ్యపురాజు గుర్రాజు పాల్గొన్నారు.



కైకలూరు మండలం గోనెపాడు జీవధ్వజ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

స్వచ్ఛాంధ్ర లక్ష్యం నెరవేరాలి

- ఎస్ఎల్ఆర్ఎం ప్రోగ్రాం విజయవంతం కావాలి
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అడ్వైజర్ శ్రీనివాసన్

చల్లపల్లి: చెత్తను పారేసే వృథా వస్తువుగా కాకుండా ఆదాయం ఇచ్చే సంపదగా మార్చినపుడే స్వచ్ఛాంధ్ర లక్ష్యం నెరవేరుతుందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అడ్వైజర్ వేలేరు శ్రీనివాసన్ అన్నారు. స్థానిక పద్మావతి హాస్పిటల్‌లో బుధవారం చల్లపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పైలట్ ప్రాజెక్ట్ సాలిడ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ కార్యక్రమంపై ఆయన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. పంచాయతీ అధికారులకు, పాలకవర్గ సభ్యులకు అవగాహన కలిగించారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ టి.పద్మావతి, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, సుధాకర్, వేములశ్రీను పాల్గొన్నారు.



ఎస్ఎల్ఆర్ఎం కార్యక్రమం వివరిస్తున్న శ్రీనివాసన్

పంటల రకాలపై అవగాహన

ఘంటసాల: గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల అగ్రికల్చర్ కాలేజ్ విద్యార్థినులు ఘంటసాల చరిత్ర, పంటల రకాలు తదితర అంశాలపై రైతులకు, గ్రామస్తులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఘంటసాల ప్రధాన రహదారులు, వనరులు, పంటలు, సమస్యలు, గ్రామ చరిత్ర టైమ్‌లైన్ తదితర ప్రదేశాలను రంగవల్లులతో తీర్చిదిద్ది ఏయే పంటలు అధికంగా పండుతాయి, రాబడి, రైతులు, సన్న చిన్నకారు రైతులు, కౌలు రైతులు, పాఠశాలలు తదితర అంశాలను తెలియపర్చేలా బొమ్మలు వేసి రైతులకు, గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు పి.యోహాను, వి.కోటేశ్వరరావు, బి.రాజేంద్ర, టి.పూర్ణచంద్రరావు, డాక్టర్ రాంబాబు, వీఏఏ రేవతి, అగ్రికల్చర్ విద్యార్థినులు కె.ప్రిస్కిల్ల, కె.షైనీ, ఆర్.శ్రావణి, ఎ.సుదర్శిణి, కె.స్వాతి పాల్గొన్నారు.



ఘంటసాల చరిత్ర, ఇతర విషయాలపై రైతులు, గ్రామస్తులకు వివరిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థినులు

నాంచారమ్మ తిరునాళ్లకు ఏర్పాట్లు కట్టుదిట్టం

కోడూరు: కృష్ణాతీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ప్రధాన తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యాలు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ టి.శ్రీనివాసరావు చెప్పారు. ఈ నెల 24, 25 తేదీల్లో జరిగే అమ్మవారి ప్రధాన తిరునాళ్లకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో ఆలయ ప్రాంగణం వద్ద బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అమ్మవారి పుట్టింటివారిగా పిలవబడే గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చే అవకాశం ఉన్నట్లు తహసీల్దార్ తెలిపారు. రెండు రోజుల పాటు సుమారు లక్ష మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉండడంతో, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల రాకపోకలపై పలు ఆంక్షలు విధిస్తున్నట్లు అవనిగడ్డ సీఐ శ్రీనాథ్ తెలిపారు. 200 మందితో బందోబస్తున్న నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని వి.కొత్తపాలెం మీదుగా వాహనాలు అనుమతించి, తిరుగు ప్రయాణం కోడూరు–కృష్ణాపురం మీదుగా పంపనున్నట్లు సీఐ తెలిపారు.



కృష్ణానది వద్ద ఘాట్లను పరిశీలిస్తున్న అధికారులు

రెండు ఘాట్ల ద్వారా పుణ్యస్నానాలు

కృష్ణానది వద్ద రెండు ఘాట్ల ద్వారా భక్తులు స్నానాలు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. బారికేడింగ్‌తో పాటు ఐదు మరబోట్లు, 12మంది గజ ఈతగాళ్లతో గస్తీ చేపట్టనున్నట్లు తెలిపారు. 40 మంది కార్మికులతో పారిశుద్ధ్య పనులను చేపట్టడంతో పాటు మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులను నిర్మిస్తామని ఎంపీడీఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు. విశ్వనాథపల్లి స్పెషల్ పేరుతో అవనిగడ్డ నుంచి ప్రతి 15 నిమిషాలకు బస్సును అవనిగడ్డ డిపో అధికారులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.